నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, శుక్రవారం 9 ఆగస్టు 2024 | NIZAMABAD


బీర్కూర్ శివారులో మంజీరా పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



## ఇసుక తవ్వకాలపై అధికారుల విచారణ

బాన్సువాడ, ఆగస్టు 8: బీర్కూర్, బిచ్కుంద మండలాల్లోని మంజీరా పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలపై అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల నమస్తే తెలంగాణలో 'పగలు ట్రాక్టర్లు.. రాత్రి టిప్పర్లు' అనే శీర్షికతో అక్రమ తవ్వకాలను వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇవే ఇసుక రీచ్‌లపై హైకోర్టులో ఫిర్యాదు చేయడంతో గనులు, సర్వే ల్యాండ్ రికార్డ్స్, నీటి పారుదల, రెవెన్యూ, పోలీసు శాఖలు ఆర్డీవో రమేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మంజీరా శివారులో ఇసుక తవ్వకాలకు టీఎస్ఎండీసీ అధికారులు ఇచ్చిన అనుమతి, తవ్వకాలు జరిపిన తీరు తదితర అంశాలపై సంయుక్తంగా విచారణ చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. టీజీఎండీసీ పీవో రాంప్రసాద్, మైన్స్ గిర్దావర్ సైదులు, డీఎస్పీ సత్యనారాయణ, తహసీల్దార్లు శ్రీలత, సురేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు

## 'మా భూముల మీదుగా రైల్వేలైన్ వద్దు..'

బాల్కొండ, ఆగస్టు 8: బాల్కొండ- ఆదిలాబాద్ నుంచి సంగారెడ్డి వరకు వేసే రైల్వేలైన్‌ను వ్యతిరేకిస్తూ బాల్కొండ జాతీయ రహదారిపై రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నూతన రైల్వేలైన్ కోసం ఇదివరకే అధికారులు సర్వే చేశారని, రైల్వే లైన్ ఏర్పాటుతో విలువైన వ్యవసాయ భూములు కోల్పోతామన్నారు. వ్యవసాయమే తమ జీవనాధారమని, భూములు ఇచ్చేందుకు ఒప్పుకోమని భీష్మించుకుర్చున్నారు. బాల్కొండ పోలీసులు రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో చిట్టాపూర్, బాల్కొండ, బోదేపల్లి, చేపూర్, వేంపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.




బాల్కొండలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

# 'ఎత్తి'పోస్తారా ఎండబెడతారా?

## ప్రారంభం కాని గుత్ప, అలీసాగర్ లిఫ్టులు

- ఎస్సారెస్పీలో ఆశాజనకంగా నీటి నిల్వ
- ఆయకట్టు రైతుల్లో తీవ్రమవుతున్న ఆందోళన
- గందరగోళంలో 1.40లక్షల ఎకరాల భవితవ్యం
- సాగునీరు అందించడంలో సర్కారు వైఫల్యం
- కాంగ్రెస్ పాలకులకు మాజీ మంత్రి వేముల డెడ్‌లైన్

నిజామాబాద్, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా పంటల సాగు జోరుగా జరుగుతుంది. నిజామాబాద్ జిల్లాలో దాదాపుగా లక్షన్నర ఎకరాలకు గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల ద్వారా ప్రయోజనం ఉంటుంది. వానలు ఆలస్యమైనప్పటికీ రైతులకు ఏ బాధాలేకుండా ఎత్తిపోతలతో సాగు నీటిని అందించే వెసులుబాటు ఉన్నది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల అమలుపై శ్రద్ధనే ఉండడం లేదు. ఆగస్టు నెల ప్రారంభమవుతున్నా.. రైతాంగానికి కీలకమైన అలీసాగర్, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతో నీళ్లను ఎత్తిపోయడమే మరిచిపోయారు. వానలు సమృద్ధిగా కురిసి చెరువుల్లోకి నీళ్లు చేరితే లిఫ్టులతో పనిలేదని కాదు. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాకు అలీసాగర్, గుత్ప ఎత్తిపోతలే ఆయువు పోస్తాయి. ఆగస్టు 8న షెడ్యూల్ ప్రకారం లిఫ్టులు రన్ చేయాల్సి ఉండగా నీటి పారుదల శాఖ నిర్ణయాన్ని అమలు చేయడం లేదు. కరెంట్ బిల్లులకు ప్రభుత్వం భయపడుతుందా? లేదంటే వానలో లిఫ్టులు నడపడం ఎందుకు? అని యోచిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ స్పందించింది. వారంలో అలీసాగర్, గుత్ప లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించాలని సర్కారుకు మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డెడ్‌లైన్ విధించారు.



అలీసాగర్ ఎత్తిపోతల పథకం

**ఆదే నిర్లక్ష్యం.. అదే తాత్సారం..**

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంతో వరద కాలువ ద్వారా రివర్స్ పంపింగ్ చేసే అవకాశం ఉండడంతో ఆయకట్టుకు గతంలో ఢోకా లేకుండా పోయింది. కానీ కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన అనంతరం రివర్స్ పంపింగ్ వ్యవస్థను వాడడం లేదు. ఎస్సారెస్పీని డెడ్ స్టోరేజీ(6టీఎంసీలు దిగువకు) దాకా వదిలేసి ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్లగొండ ప్రాంతానికి నీళ్లను యథేచ్ఛగా తరలించారు. రివర్స్ పంపింగ్ ద్వారా గోదావరి జలాలను ఎస్సారెస్పీకి ఎదురెక్కించి నిజామాబాద్ ప్రాంత రైతుల నమ్మకాన్ని నిలబెట్టలేకపోయింది. వానలు ఆశాజనకంగా కురువకపోవడంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కీలక సమయాన్ని గాలికి వదిలేస్తున్నది. ప్రస్తుతం వాన నీరు, ఎగువ నుంచి వచ్చిన వరదతో శ్రీరాంసాగర్‌లో ఆశాజనకంగా నీటి నిల్వ ఉండగా గుత్ప, అలీసాగర్ లిఫ్టులు ప్రారంభించేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నది. దీంతో రంగంలోకి దిగిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. త్వరలోనే అలీసాగర్, గుత్ప ఎత్తిపోతలను తెరిచి సాగు నీళ్లు అందించాలని లేదంటే రైతులతో కలిసి మోటర్లు ప్రారంభించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### ఇదేమీ నిర్లక్ష్యం..?

నిజామాబాద్ జిల్లాకు ఆయువుపట్టుగా నిలిచిన గోదావరి నదిలో జలకళ సంతరించుకోవడంతో సాగుపై రైతుల్లో ఒకింత ధైర్యం ఏర్పడింది. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు 1080 అడుగులు ఉండడంతో ఎత్తిపోతల ద్వారా పంటలకు సాగునీరు తీసుకునేందుకు అవకాశం ఉన్నది. కానీ నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. వాస్తవానికి 1060 అడుగుల వరకు నీళ్లను ఎత్తిపోసుకునే సౌలభ్యం ఉన్నది. కానీ ఎత్తిపోతలను మాత్రం తెరవకపోవడంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తున్నది. వానలు కురుస్తాయనే ఏకైక ఆశపైనే సర్కారు ముందుకు నడుస్తున్నది. కానీ కాలం చేయి దాటితే జరిగే నష్టాన్ని మాత్రం పూడ్చలేమనే సంగతిని నీటిపారుదల శాఖ విస్మరించింది. బాబ్లీ గేట్లు ఎత్తి ఉండడం, ఎగువ గోదావరి నుంచి వరద పుష్కలంగా వస్తుందంటూ భవిష్యత్తును ఊహించుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడుపుతున్నది. ఎస్సారెస్పీ నిండుకుండను తలపించినా అలీసాగర్, గుత్ప పరిధిలోని 1.40లక్షల ఎకరాల ఆయకట్టు రైతులకు మాత్రం ఎత్తిపోతలే శరణ్యం అన్న సంగతిని పాలకులు మర్చిపోయారా? అన్నది తెలియడం లేదంటూ రైతులు వాపోతున్నారు. జాప్యం చేయకుండా త్వరగా సాగునీళ్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

గుత్ప ఎత్తిపోతల పథకం



### గుత్ప లిఫ్టు నీటిని విడుదల చేయాలి



మాక్లూర్, ఆగస్టు 8: ప్రభుత్వం గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయించి రైతాంగాన్ని ఆదుకోవాలి. అడపా, దడపా వర్షాలు పడడంతో ప్రస్తుతం పంటలకు ఢోకా లేకపోయిన చెరువుల్లో మాత్రం ఆశించిన స్థాయిలో నీళ్లు లేవు. లిఫ్ట్ ద్వారా నీటి సరఫరా చేయకపోతే చెరువుల కింద ఉండే పంటలు పండే అవకాశం లేదు. ఇప్పటికీ చెరువులు మత్తడి దుంక లేదు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు నింపడం లేదు. లిఫ్టుల ద్వారా చెరువులను నింపి రైతులను ఆదుకోవాలి. లేదంటే రైతులందరం కలిసి లిఫ్ట్ మోటర్లు ఆన్‌చేసి చెరువులు నింపుకొంటాం.

**- గంగోనే మల్లేశ్, రైతు, కల్లడి**

### సమయం దాటిన తర్వాత వస్తే ఏం లాభం..



మాక్లూర్, ఆగస్టు 8: నాపేరు ఈర్నాల శంకర్. మాది ధర్మోర గ్రామం. నాకు ఎకరం సొంత పొలం ఉండగా... మిగతాది కౌలు చేస్తున్నాను. గతేడాది ఈ సమయానికి మా పొలం మీదనే ఉన్న కాలువల ద్వారా గుత్ప లిఫ్టు నుంచి నీళ్లు వచ్చేవి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రాలేదు. దీంతో పక్కన ఉండే పొలం నుంచి నీటిని అడిగి పెట్టుకోవాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి ఇప్పటికైనా గుత్ప నీటిని విడుదల చేయాలి. సమయం అయిపోయిన తర్వాత లిఫ్ట్ నీటిని విడుదల చేస్తే మాకు ఎలాంటి లాభం ఉండదు.

**-ఈర్నాల శంకర్, యువరైతు, ధర్మోర**




## తరగతి గదుల్లో.. కార్యాలయాలు

- డైనింగ్ హాల్‌లో పాఠాల బోధన
- చెట్ల కింద విద్యార్థుల భోజనాలు
- శంకర్‌భవన్ పాఠశాలలో విచిత్ర పరిస్థితి

ఖలీల్‌వాడి, ఆగస్టు 8: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లోని శంకర్‌భవన్ ప్రభుత్వ పాఠశాల అనేక కార్యాలయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు నిర్వహిస్తుండగా సుమారు 18గదులు ఉన్నాయి. ఇందులో 10 గదులను మాత్రం తరగతులకు కేటాయించి, మిగతా ఎనిమిదింటిని వివిధ కార్యాలయాలకు కేటాయించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గదుల కొరతతో ఇటీవల నిర్మించిన డైనింగ్ హాల్‌ను తరగతి గదిగా వాడుకుంటున్నారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు చెట్లకింద, వరండాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో చదువుకునే పరిస్థితి నెలకొన్నది. ఇక్కడ డీసీఈబీ కార్యాలయం, మండల విద్యాధికారి, అగస్త్య ఫౌండేషన్ సైన్స్ ల్యాబ్‌లకు గదులను కేటాయించారు. ఇదే పాఠశాలలో అప్పుడప్పుడు ఓ ఉపాధ్యాయ సంఘం సైతం మీటింగ్‌లు నిర్వహించడం గమనార్హం.




డీసీఈబీ కార్యాలయానికి కేటాయించిన గది

### చెట్ల కిందే భోజనం..

పాఠశాలకు కేటాయించిన డైనింగ్ హాల్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తుండడంతో మధ్యాహ్న భోజనాన్ని ఆరుబయట చెట్ల కింద తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇన్ని కార్యాలయాలు ఉన్న ఈ స్కూల్ ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా ఉండడంతో తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. చెత్తా చెదారం, వర్షపు నీటి మడుగులు ఉండడంతో దోమలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా పాఠశాలలోని కార్యాలయాలను మరోచోటికి తరలించాలని, విద్యార్థులకే తరగతి గదులు కేటాయించాలని కోరుతున్నారు.



శంకర్‌భవన్ పాఠశాలలో కొనసాగుతున్న ఎంఈవో కార్యాలయం, ఆవరణలో వర్షపు నీరు

## మాఫీ రాలేదు.. న్యాయం చేయండి..

**ఎమ్మెల్యేను కలిసిన గుండారం సొసైటీ రైతులు**

సారంగాపూర్, ఆగస్టు 8: గుండారం సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యంతో తమకు మాఫీ వర్తించలేదని, మీరే ఎలాగైనా న్యాయం చేయాలంటూ వివిధ గ్రామాలకు చెందిన 68మంది రైతులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఎదుట మొరపెట్టుకున్నారు. దాసరి శ్రీధర్ నేతృత్వంలో గురువారం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని రైతులు కలిశారు. గుండారం సొసైటీలో తాము 2023 అక్టోబర్‌లో పంట రుణాలు తీసుకున్నామని, అప్పట్లో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణతో సొసైటీ సిబ్బంది అక్టోబర్‌లో రుణాలు పొందిన వారి రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేని పరిస్థితి ఏర్పడిందని శ్రీధర్ వివరించారు. ఎనిమిది నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 9వ తేదీలోపు రుణాలు పొందిన రైతులకు మాఫీ వర్తిస్తుందని ప్రకటించగా.. సొసైటీ సిబ్బంది 68మంది రైతుల వివరాలు డిసెంబర్ 9 తర్వాత నమోదు చేశారని తెలిపారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి 68 మంది రైతులు అనర్హులుగా ప్రకటించే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు.



రుణమాఫీ వర్తించలేదని ఎమ్మెల్యే భూపతిరెడ్డికి విన్నవిస్తున్న బాధిత రైతులు

## బైక్ కొనివ్వలేదని..

**తండ్రిని హతమార్చిన తనయుడు**

మద్నూర్, ఆగస్టు 8: బైక్ కొనివ్వలేదని ఆగ్రహానికి గురైన ఓ కుమారుడు తండ్రిని కర్రతో కొట్టి చంపాడు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ కొండ కథనం ప్రకారం.. మద్నూర్‌కు చెందిన అర్జున్(64), ఎల్లవ్వ దంపతులు రాళ్లు కొట్టుకుని జీవిస్తున్నారు. వీరి ఏకైక కుమారుడు వెంకట్ బైక్ కొనివ్వాలని తండ్రిని అడుగుతున్నాడు. బుధవారం రాత్రి కూడా అడిగితే, ఇప్పటికే అప్పు ఉందని, తర్వాత చూద్దామని అర్జున్ బదులిచ్చాడు. దీంతో కోపోద్రిక్తుడైన వెంకట్ కర్రతో తండ్రి తలపై బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావమైన అర్జున్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.